WWW.EPAPER.MAHADAILY.COM

మహా పత్రిక

ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

6-1-2025



## పరశురామవతారంలో భద్రాద్రి రామయ్య

**నేడు నిజరూపంలో రామయ్య దర్శనం (శ్రీరామావతారం)**

శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవ స్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.



02



02

## కొత్తగూడెం కార్పొరేషన్‌కి గ్రీన్‌సిగ్నల్

- పాల్వంచ- కొత్తగూడెం మరో కొన్ని పంచాయతీ కలుపుతూ ఆమోదం
- ముఖ్యమంత్రికి, జిల్లా మంత్రులకు కూనంనేని కృతజ్ఞతలు

కొత్తగూడెం టౌన్, పాల్వంచ పట్టణాలు, సుజాతనగర్ మండలంలోని కొన్ని గ్రామాలను కలిపి కార్పొరేషన్‌గా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం నుంచి ప్రకటన వెలువడటంతో అందుకు కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరావు, పొంగు లేటి శ్రీనివాసరెడ్డికి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కొత్తగూడెం, మహా

02



## ముక్కోటి ఉత్సవాలకు సర్వం సిద్ధం

- ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో దామోదర్ రావు
- హంస వాహనానికి ట్రయల్ రన్ నిర్వహించిన అధికారులు

# మట్కా దందా!



03

## అధికారుల కళ్లు గప్పి ఆట

- సెల్‌ఫోన్ మెసేజ్‌లతో దందా
- ఆర్థికంగా నష్టపోతున్న సామాన్యులు
- మట్కాపై పోలీసుల నిఘా కరువు
- తక్షణమే చర్యలు తీసుకోవాలి: సిపిఐ

జిల్లాలో మట్కా జూదం కొత్త రూపం దాల్చి, ఆన్‌లైన్ వేదికగా మరింత విస్తరిస్తోంది. పేద, మధ్య తరగతి కుటుంబాలను ఆర్థికంగా నాశనం చేస్తూ, జీవన గమనం మార్చేస్తున్న ఈ ఆట ప్రభుత్వ నిషేధ ఆదేశాల్ని అతిక్రమించి నడుస్తోంది.

ఖమ్మం జిల్లా, మహా



### సాంకేతికతతో...

మట్కా నిర్వహణలో సాంకేతికత ప్రధాన భూమిక పోషిస్తోంది. దుకాణాలు, మొబైల్ రిపేర్ సెంటర్లు వంటి చిన్న వ్యాపారాల వెనుక మట్కా నిర్వహణ జరుగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. నంబర్లు, డబ్బులు పూర్తిగా డిజిటల్ వేదికల ద్వారా పంచుకోవడం ద్వారా నిర్వాహకులు గుర్తించలేని పరిస్థితి ఏర్పడింది.

FOLLOW: @ANNTELUGU
6-1-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు



# పరశురామవతారంలో భద్రాద్రి రామయ్య

## నేడు నిజరూపంలో రామయ్య దర్శనం

**(శ్రీరామావతారం)భద్రాచలం, జనవరి 5, (మహా):** శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారు శ్రీమహావిష్ణువు దశావతారాలల్లోని ఆరవ అవతారమైన పరుశు రామవతారంలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకస్వాములు బేడా మండపంలో ఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం స్వామివారిని పరశురామవతారంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచారు. మధ్యాహ్నం స్వామివారికి రాజభోగం సమర్పించి ప్రత్యేక పల్లకీలో స్వామి వారిని ఊరేగింపుగా మేళతాళాలు, వేద మంత్రాల నడుమ మిథిలా స్టేడియంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదికపై భక్తుల దర్శనార్థం ఆశీనులను చేశారు. స్వామి వారికి నైవేద్యం సమర్పించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అర్చకస్వాములు పరశురామవతార విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం సాయంత్రం స్వామి వారికి తాతగుడి సెంటర్ వరకు తిరువీధి సేవ నిర్వహించి ఆలయంలోకి తీసుకొని వెళ్లారు.

# కొత్తగూడెం కార్పొరేషన్‌కి గ్రీన్ సిగ్నల్



**కొత్తగూడెం, జనవరి 5, మహా:** కొత్తగూడెం టౌన్, పాల్వంచ పట్టణాలు, సుజాతనగర్ మండలంలోని కొన్ని గ్రామాలను కలిపి కార్పొరేషన్ గా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం నుంచి ప్రకటన వెలువడటంతో అందుకు కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హుటాహుటిన హైదరాబాద్ వెళ్లిన కూనంనేని మంత్రులతో వరుసబెట్టి అయ్యారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వర్రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను కలుసుకొని పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం ప్రాంతం అభివృద్ధి కార్పొరేషన్ ఏర్పాటు వల్లే సాధ్యమని గుర్తించి ఏడాది కాలంగా ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి ఒప్పించి కార్పొరేషన్ సాధించడం జరిగిందని, ఇది కొత్తగూడెం నియోజకవర్గం మరింత అభివృద్ధి సాదించేందుకు దోహద పడుతుందన్నారు. కార్పొరేషన్ ఏర్పాటుకు సహకరించిన రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులకు కూనంనేని కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో త్వరలో విమానాశ్రయం గరీబీపేట కేంద్రంగా త్వరలో విమానాశ్రయం ఏర్పాటుకు జరగబోతోందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. విమానాశ్రయం స్థలం సర్వే చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎయిర్పోర్ట్ అథారిటీకి రూ.38 లక్షలు మంజూరు చేసిందని కూనంనేని తెలిపారు. ఎయిర్పోర్ట్ ఏర్పాటుపై ప్రేత్యక దృష్టి సారించి ఆనతికాలం ఎయిర్పోర్ట్ ఏర్పాటు జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో వెనుకడుగువేసేది లేదన్నారు, అనునిత్యం శ్రమించి ప్రజలకు కావలసిన అన్ని సౌకర్యాలు కల్పిస్తానని తెలిపారు.

# టెలికం బోర్డు అడ్వైజరి కమిటీ సభ్యుల ఎన్నిక

**కొత్తగూడెం, జనవరి 5, మహా:** టెలికం బోర్డు అడ్వైజరి కమిటీ సభ్యులుగా బోదాస్ కనకరాజు, కుమార్ ట్రాన్స్పోర్ట్ కమిటీ సభ్యులుగా బాదర్ల జోషి నియమితం అయినా సందర్బంగా ఆదివారం పొంగులేటి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో జెడ్పి చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, డీసీఎంస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న మాట్లాడుతూ పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు కష్టపడి పని చేసిన వారికే పదవులు దక్కుతాయని, కష్టపడి పని చేసే వారికి భవిష్యత్‌లో కూడా అవకాశాలు కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీకి తమపై నమ్మకం ఉంచి అడ్వైజరి బోర్డు సభ్యులుగా తమను నామినేట్ చేసిన ఖమ్మం ఎంపీ రాం సహాయం రఘురాం రెడ్డి, రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక నాయకులు ఆళ్ళ మురళి తదితర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ళ మురళి, నాగేంద్ర త్రివేది, పెదబాబు, సొసైటీ చైర్మన్ మండే వీరహనుమంత్ రావు, కౌన్సిలర్ రైల్వే బోర్డు సభ్యులు వై శ్రీనివాస్ రెడ్డి, సుజాతనగర్ మండల అధ్యక్షులు చింతలపూడి రాజశేఖర్, పాల సత్యనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ముక్కోటి ఉత్సవాలకు సర్వం సిద్ధం

**భద్రాచలం జనవరి 5 (మహా):** శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవ ఏర్పాట్లను భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి సమీపిస్తున్నందున సర్వం సిద్ధం చేశామని, రివర్ ఫెస్టివల్ నిర్వహణ కోసం జరుగుతున్న ఏర్పాట్లు ముగింపు దశకు వచ్చాయని అన్నారు. గోదావరి కరకట్ట ప్రాంతంలో రివర్ ఫెస్టివల్ కొరకు నిర్మాణం చేపడుతున్న తాత్కాలిక పర్యాటకుల విడిది గృహాలు, వివిధ గిరిజన వంటకాలు, గిరిజన కళాఖండాలకు సంబంధించిన స్టాల్స్, పర్యాటకులు విహరించే బోట్ షికార్ పనులను ఆయన పరిశీలించారు. పర్యాటకులకు అన్ని వసతి సౌకర్యాలతో తాత్కాలిక విడిది గృహాల నిర్మాణం పనులు 90 శాతం పూర్తి చేయడం జరిగిందని, అలాగే వివిధ కళాకృతులకు సంబంధించిన స్టాల్స్ నిర్మాణం పనులు వేగవంతంగా నడుస్తున్నాయని అన్నారు. పర్యాటకులు విడిది గృహాలలో ప్రశాంతంగా సేద తీరడానికి, గోదావరిలో విహరించడానికి బోట్ సౌకర్యం, బస చేసిన వారికి డైనింగ్ హాల్ ఏర్పాట్లు, విడిది చేసే ప్రాంతమంతా విద్యుత్ కాంతులు వెదజల్లేలా సోలార్ విద్యుత్ ఏర్పాట్లు చేయడం జరిగిందని, చుట్టూ ఉన్న గోదావరి అందాలను సెల్ఫీ



ద్వారా ఫోటోలు తీసుకోవడానికి సెల్ఫీ పాయింట్ కూడా నిర్మించామన్నారు. అలాగే నిర్వహించే కల్చరల్ ప్రోగ్రామ్స్ గోదావరి పక్కన ఏర్పాటు చేసిన స్టేజి నుండి భద్రాచలం పట్టణం మొత్తం వినిపించేలా సౌండ్ సిస్టం ఏర్పాటు చేయాలని దేవస్థానం ఈ ఈ రవీందర్ కు ఆదేశించారు. తొమ్మిదిన నిర్వహించే తెప్పోత్సవం కార్యక్రమానికి హంస వాహనం సిద్ధం కాగా, హంస వాహనం కు ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్, దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి, ఆలయ ఈఈ రవీందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆత్మీయ సమ్మేళనం

**ఖమ్మం సిటి, జనవరి 05, మహా:** మేకల బిక్షమయ్య ఫంక్షన్ హాల్ లో ఖమ్మం జిల్లా ఐఎన్‌టీయూసీ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కొత్త సీతారాములు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా యుగంధర్, నాగన్న గౌడ్, జలీల్ హాజరయ్యారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వెంకటేశ్వర్లు, నిరోషా, అంజి రెడ్డి, రెడ్డి ప్రత్యేకంగా పాల్గొన్నారు. జిల్లా మహిళా అధ్యక్షులు పద్మ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సౌజన్య, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మొక్క శేఖర్ సమావేశంలో పాల్గొన్నారు. పమ్మి వెంకటేశ్వరరావు, పాషా సమగ్ర సమన్వయంతో కార్యక్రమం విజయవంతమైంది. నరాల నరేష్ మోహన్ నాయుడు, పాల్వంచ కృష్ణ ముఖ్య పాత్ర వహించారు. కార్మిక సంక్షేమం, సంఘాల అభివృద్ధి పై కీలక చర్చ జరిగింది. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.



# ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్‌పై చర్యలు తీసుకోవాలి



**ఖమ్మం సిటి, జనవరి 05, మహా:** సింగరేణి మండల కేంద్రంలో ఆదివారం పి.వై.ఎల్. ఆధ్వర్యంలో యువకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి ఎన్.వి. రాకేష్ మాట్లాడుతూ ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్ కారణంగా వందలాది యువకులు అప్పులపాలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న మొత్తాలతో ప్రారంభమయ్యే బెట్టింగ్ కార్యకలాపాలు యువతను ఆకర్షించి, వారికి ఆర్థిక సమస్యలను, కుటుంబ కలహాలను సృష్టిస్తున్నాయని తెలిపారు. ఐతే, ఇలాంటి యాప్స్ ప్రచారానికి సోషల్ మీడియా వేదికలుగా మారాయని, ఇంస్టాగ్రామ్, యూట్యూబ్ లాంటి ప్లాట్‌ఫారమ్స్ లో కొంతమంది ప్రమోట్ చేస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో, ప్రభుత్వాన్ని తక్షణమే ఆన్లైన్ బెట్టింగ్ యాప్స్ ను నిషేధించాల్సిందిగా డిమాండ్ చేశారు. అంతేకాకుండా, సోషల్ మీడియాలో ఇలాంటి యాప్స్ ప్రమోట్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాము, ప్రశాంత్, ప్రవీణ్, భరత్, హరి, దేవరాజు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థికంగా దెబ్బతీసే మోడీ విధానాలు



**ఖమ్మం సిటి, జనవరి 05, మహా:** నూతన ఆర్థిక విధానాలు ఫలితంగానే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకాయి అని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు పేర్కొన్నారు ఆరోపిం చారు. ఆదివారం సుందరయ్య భవన్ లో పార్టీ ఖమ్మం డివిజన్ వర్క్ షాప్ లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు సంస్కరణలను వేగవంతంగా మోడీ ప్రభుత్వం అమలు చేస్తుంది అని, ఈ నూతన సంస్కరణలు ఫలితంగా ప్రజలపై ఆర్థిక భారాలు పెరుగుతాయి అని విమర్శించారు. పెట్రోల్ , డీజిల్, గ్యాస్ , ఇతర వస్తువుల ధరలు విపరీతంగా బిజెపి పాలనలో పెరిగాయి అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ సెక్రటరీ వై విక్రమ్, నాయకులు నర్రా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి మున్సిపాలిటీకి నూతన పరికరాలు



**సత్తుపల్లి, జనవరి 5: మహా:** పట్టణ పరిసరాల పారిశుధ్య అవసరాల నిమిత్తం సత్తుపల్లి మున్సిపాలిటీ కార్యాలయ సిబ్బంది కొత్త పరికరాలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా నూతనంగా కొనుగోలు చేసిన డోజర్ ట్రాక్టర్ ను నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు దయానంద్ విజయకుమార్ ప్రారంభించారు. అనంతరం ప్రారంభించిన డోజర్ పై కూర్చొని కొంత దూరం స్వయంగా నడిపారు. సమావేశానికి హాజరైన మున్సిపాలిటీ కార్మికులకు ఎమ్మెల్యే పి.పి.టి కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుసంపూడి.మహేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ తోట.సుజలా రాణి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ.ఆనంద్, కౌన్సిలర్లు పద్మ జ్యోతి, దూదిపాల.రాంబాబు, కంటే.నాగలక్ష్మి, నాగుల్ మీరా, సీనియర్ నాయకులు చల్లగుళ్ళ. నరసింహారావు, కమల్ పాషా, గోలి శ్రీనివాస్ రెడ్డి, మానుకోట ప్రసాద్, పింగిలి సామేలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మట్కా దందా!

ఖమ్మం జిల్లా, జనవరి 5: మహా: జిల్లాలో మట్కా జూదం కొత్త రూపం దాల్చి, ఆన్‌లైన్ వేదికగా మరింత విస్తరిస్తోంది. పేద, మధ్య తరగతి కుటుంబాలను ఆర్థికంగా నాశనం చేస్తూ, జీవన గమనం మార్చేస్తున్న ఈ ఆట ప్రభుత్వ నిషేధ ఆదేశాల్ని అతిక్రమించి నడుస్తోంది.



## మార్కెట్ వీధుల నుంచి ఆన్‌లైన్ వరకూ..

ఖమ్మం పట్టణాల్లోని మార్కెట్ వీధులు, పలు ప్రధాన ప్రాంతాల్లో మట్కా ఏజెంట్లు రోజు లక్షల్లో దందా నిర్వహిస్తున్నారు. గతంలో రహస్యంగా కాగితం చీటీల పద్ధతిలో సాగిన ఈ ఆట ఇప్పుడు సాంకేతికతను వినియోగించుకుని ఆన్‌లైన్ ప్లాట్‌ఫార్మ్‌లకు మళ్లింది. గూగుల్ పే, ఫోన్ పే వంటి డిజిటల్ చెల్లింపుల ద్వారా డబ్బులు, నంబర్ల లావాదేవీలు జరుగుతున్నాయి.

## పట్టణాలు, మండల కేంద్రాల్లో విస్తరణ

ఖమ్మం, వైరా, సత్తుపల్లి వంటి పట్టణాలతో పాటు పలు మండలాలు, పంచాయతీలకు మట్కా వ్యాపారం విస్తరించింది. రోజుకు సుమారు రూ. 25 లక్షల మట్కా పందేల లావాదేవీలు జరుగుతున్నట్లు సమాచారం. ఒక్కో ఏజెంట్ రోజుకు రూ. 5,000 నుంచి రూ. 10,000 వరకు ఆదాయం పొందుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

## కుటుంబాల జీవనంపై ప్రభావం

మట్కా కారణంగా సామాన్య కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంటున్నాయి. సంపాదన అంతా మట్కాలో పోగొట్టుకుంటూ, అప్పులపాలు అవుతూ, రోడ్డున పడుతున్నారు. నంబర్లు తగులుతాయన్న ఆశ, డబ్బు కోల్పోతామన్న భయం ప్రజల జీవితాలను మరింత కష్టాల్లో నెట్టేస్తోంది. మట్కా నిర్వహణపై పోలీసుల నిర్లక్ష్యం విమర్శలు ఎదుర్కొంటోంది. జూదంలో నిమగ్నమైన కొందరిని మాత్రమే పట్టుకుంటూ, ప్రధాన నిర్వాహకులను వదిలిపెట్టడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహస్య వేదికలపై ఈ ఆట కొనసాగుతున్నా, పోలీసుల నుంచి గట్టి చర్యలు కనిపించడం లేదు.

## కఠిన చర్యల అవసరం

మట్కా నిర్వాహకులపై ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికారులు చొరవ చూపి మట్కా నిర్వహణను నిలిపేయాలి. వ్యాపార స్థావరాలపై నిఘా పెంచి, ఆన్‌లైన్ చెల్లింపులను పర్యవేక్షించాలి.

## అవగాహనతోనే పరిష్కారం

**మట్కా కారణంగా కోల్పోయే జీవన నష్టాలను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించడం ముఖ్యమని సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు. అత్యాశ బాటలో నష్టాలను ఎదుర్కొంటున్న ప్రజలను సమాజం రక్షించుకోవాలి.**

## త్రీ టౌన్‌లో మట్కా జూదం నిషేధించాలి: సీపీఐ డిమాండ్

**త్రీ టౌన్ ప్రాంతంలో మట్కా జూదం విపరీతంగా పెరిగి పేద, మధ్య తరగతి కుటుంబాలను నాశనం చేస్తోందని సీపీఐ త్రీ టౌన్ సమితి ఎస్ఐ రమేష్‌కి మెమోరాండం ఇచ్చింది. సీపీఐ త్రీ టౌన్ కార్యదర్శి నూనె శశిధర్ మట్కా కారణంగా పేద కుటుంబాలు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు భూక్యా రవీందర్ విద్యార్థులు, యువత ఆన్‌లైన్ జూదం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని తెలిపారు. సీపీఐ సీనియర్ నేతలు జెట్టి కృష్ణయ్య, బొల్లేపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొని మట్కా నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.**

# నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన లింగాల కమల్ రాజు




**మధిర , జనవరి 05, మహా:** మధిర నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు నూతన సంవత్సరం సందర్భంగా బీఆర్ఎస్ కీలక నేతలను మర్యాద పూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, సీనియర్ నేత, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఖమ్మం రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర గార్లను కలిసిన కమల్ రాజు వారితో ఆత్మీయంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమల్ రాజు వారికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. నేతలు కమల్ రాజును ఆత్మీయ ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పారు. నాయకత్వంలో ప్రగతి సాధనపై ఆత్మీయ చర్చలు జరిపారు.





# సంక్షేమ పాలనకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

## రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ



**వైరా, జనవరి 05, మహా:** తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ కేంద్రంలో మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ అభినందన సభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైరా పట్టణంలో అయ్యప్ప స్వామి ఆలయం నుంచి రింగ్ రోడ్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి వైరా ప్రజలు అధిక సంఖ్యలో హాజరై హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్‌కు ఘన స్వాగతం పలికారు. మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ అనంతరం జరిగిన సభలో నాయుడు సత్యనారాయణ ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కల ప్రధాన లక్ష్యమని అన్నారు. భట్టి విక్రమార్క సహకారంతో హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి చేపట్టడం గర్వకారణమని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు వనమా విశ్వేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ జయపాల్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్ర రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# దూసుకొస్తున్న హెచ్ఎంపివి

- ప్రజలు ఎలాంటి నిర్లక్ష్యం చెయ్యొద్దు
- వ్యాప్తి నివారణకు రేవంత్ సర్కార్ కీలక చర్యలు
- మార్గదర్శకాలు  జారీచేసిన ప్రభుత్వం

**ఖమ్మం, జనవరి, మహా:** చైనాలో మెటాన్యుమోవైరస్ శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రజారోగ్య పరిరక్షణ కోసం రాష్ట్రంలో కీలక మార్గదర్శకాలను జారీచేసింది. కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ సూచనలను అనుసరిస్తూ, హెచ్ఎంపీవీ ప్రమాదాన్ని అరికట్టడానికి చర్యలు చేపట్టింది. తెలంగాణ ప్రజారోగ్య–కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ బీ. రవీందర్ నాయక్ ప్రకటనలో, రాష్ట్రంలో ఇప్పటివరకు హెచ్ఎంపీవీ కేసులు నమోదు కాలేదని, అయితే ఈ వైరస్ వ్యాప్తి ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలు ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదని హెచ్చరించారు. హెచ్ఎంపీవీ ఒక శ్వాసకోశ వైరస్ అని, ముఖ్యంగా చలికాలంలో చిన్నపిల్లలు, వృద్ధులు దీని బారిన పడే అవకాశముందని వివరించారు.

### హెచ్ఎంపీవీ లక్షణాలు

హెచ్ఎంపీవీతో బాధపడేవారిలో సాధారణ జలుబు, దగ్గు, గొంతు నొప్పి, జ్వరం, శ్వాస సంబంధిత సమస్యలు కనిపిస్తాయి. తీవ్రమైన పరిస్థితుల్లో ఇది ఊపిరితిత్తుల అనారోగ్యానికి దారితీస్తుంది. ముఖ్యంగా దీని ప్రభావం పిల్లలు, వృద్ధులు, బలహీన ఇమ్యూనిటీ ఉన్నవారిపై అధికంగా ఉంటుంది.

### పాటించాల్సిన జాగ్రత్తలు

- శుభ్రత: దగ్గు, తుమ్ము సమయంలో నోటికి లేదా ముక్కుకు టిష్యూ లేదా హ్యాండ్ కర్చీఫ్ ఉపయోగించాలి.
- చేతులు శుభ్రపరచడం: సబ్బు లేదా ఆల్కహాల్ ఆధారిత శానిటైజర్ ఉపయోగించి చేతులను తరచూ శుభ్రపరచుకోవాలి.
- గుంపుల వద్దకు వెళ్లకూడదు: బహిరంగ ప్రదేశాలు, గుంపులు కలసే ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఫ్లూ లక్షణాలతో బయటికి రాకుండా చూడాలి: జ్వరం, దగ్గు వంటి లక్షణాలుంటే ఇంట్లోనే ఉండాలి.
- మంచినీళ్లు, పౌష్టికాహారం: శరీరానికి అవసరమైన నీరు, పౌష్టికాహారం తీసుకోవాలి.
- గాలి చొరబడేలా చూడాలి: గదులను గాలి చొరబడేలా ఉంచాలి.
- నిద్ర: కంటి నిండా నిద్రపోవడం ద్వారా శరీరాన్ని విశ్రాంతి చేయాలి.

తప్పించుకోవాల్సిన పనులు

- షేక్ హ్యాండ్స్: ఇతరులతో షేక్ హ్యాండ్స్ చేయకూడదు.
- టిష్యూ పునర్వినియోగం: ఒకసారి ఉపయోగించిన టిష్యూ లేదా హ్యాండ్ కర్చీఫ్ మళ్లీ వాడకూడదు.
- అనారోగ్యంతో బాధపడుతున్న వారిని దూరంగా ఉంచాలి: వారి వద్దకు వెళ్లకూడదు.
- నోటిని, ముక్కును తడుమడం: ముక్కు, నోటిని చేత్తో తుడవడం మానుకోవాలి.
- ఉమ్మివేయడం: బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయడం నిషేధం.
- సెల్ఫ్ మెడికేషన్: డాక్టర్ సలహా లేకుండా ఏ మందులనూ ఉపయోగించరాదు.

### ప్రభుత్వం చర్యలు

తెలంగాణ ప్రభుత్వం హెచ్ఎంపీవీ నివారణ కోసం అన్ని ఆసుపత్రుల్లో హైఅలర్ట్ ప్రకటించింది. వైద్యసేవలు సిద్ధంగా ఉండేలా చర్యలు చేపట్టింది. ప్రజలు సూచించిన మార్గదర్శకాలను పాటించడం ద్వారా వ్యాధి నివారణలో కీలక పాత్ర పోషించవచ్చని అధికారులు పేర్కొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఆరోగ్య భద్రతను కాపాడేందుకు సర్కార్ ప్రాధాన్యతనిస్తోందని ప్రభుత్వం వెల్లడించింది. "ప్రజల భాగస్వామ్యం, జాగ్రత్తలు పాటించడం వల్ల హెచ్ఎంపీవీ వ్యాప్తి అరికట్టవచ్చు" అని డాక్టర్ రవీందర్ నాయక్ తెలిపారు. హెచ్ఎంపీవీ వ్యాప్తి ప్రమాదాన్ని అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందు జాగ్రత్తలు తీసుకుంటోంది. ప్రజలు సూచించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, ఆరోగ్యానికి హాని కలిగించకుండా నివారించుకోవాలని కోరుతోంది.

## లక్ష్యం కోసం పని చేసేందుకు వయసు ఆటంకం కాదు

**పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు**



**బోనకల్, జనవరి 5, మహా :** మనసును మాయచేసే ఉచ్చులో ఇరుక్కున్న వ్యక్తి తన శక్తిని గ్రహించలేడని పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు తెలిపారు. ఆదివారం బోనకల్ సిపిఎం కార్యాలయంలో తెల్లాకుల శ్రీనివాసరావు అధ్యక్షతన మైండ్ ట్రాప్స్ వదిలించుకోవడం ఎలా అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా కొండలరావు మాట్లాడుతూ నాలుగు ప్రధానమైన మైండ్ ట్రాప్స్ వదిలించుకోవడం ద్వారా ప్రతి మనిషి విజేత కాగలడన్నారు. ఆశయం కోసం పని చేసేందుకు వయసు ఆటంకం కాదన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారు సురేష్, బంధం శ్రీనివాసరావు, గుగులోత్ నరేష్, జొన్నలగడ్డ సునీత, కుక్కల కోటేశ్వరరావు, కొండేటి అప్పారావు, సంపత్ పాల్గొన్నారు.

## అహింస ధర్మ ప్రచార అవగాహన ర్యాలీ.

**ఖమ్మం సిటి, జనవరి 05, మహా:** ఖమ్మం పట్టణంలో ఆదివారం పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సర్దార్ పటేల్ స్టేడియం నుండి ముస్తాఫ్ నగర్ గోదాదేవి పిరమిడ్ వరకు అహింస ధర్మ ప్రచార అవగాహన ర్యాలీ జరిగింది . తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాసిన ఆనంద్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగు రాష్ట్రాల నుండి మరి నేషనల్ అధ్యక్షులు కట్ట రెడ్డి పాల్గొన్నారు . తెలుగు రాష్ట్రాల నుంచి పిరమిడ్ పార్టీ మాస్టర్లు రావడం జరిగింది . ఈ కార్యక్రమం చాలా అద్భుతంగా జరిగింది . ఈ కార్యక్రమానికి తెలంగాణ స్టేట్ జనరల్ సెక్రెటరీ చింత అనిల్ కుమార్ , ఆంధ్రప్రదేశ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్ , ఉత్తర తెలంగాణ ఇన్చార్జ్ అంజయ్య , మహిళా విభాగం ఉత్తర తెలంగాణ రజిత వాణి , పి ఎస్ ఎస్ ఎం ఖమ్మం అధ్యక్షురాలు , కాటేపల్లి శైలజ , నల్గొండ జిల్లా నుండి కర్నాటి రాంబాబు , అరవింద్ రెడ్డి , శ్రీనివాస్ , విజయ్ , పలువురు సభ్యులు పాల్గొన్నారు . ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ప్రజల్లో ఆత్మజ్ఞానాన్ని అహింసా సిద్ధాంతాన్ని శాఖాహారాన్ని అవగాహన చేయడం . ఆత్మజ్ఞానం పరిపాలకులు అయిన నాడే ప్రజలకు సుపరిపాలన అందించడం జరుగుతుందని అనే ఉద్దేశంతో అవగాహన చేయడం కోసం ఈ కార్యక్రమం జరిగిందని పేర్కొన్నారు .



## తల్లాడ మండలంలో కొనోకార్పస్ మొక్కలపై రైతుల ఆందోళన

**తల్లాడ, జనవరి 05, మహా:** ఖమ్మం జిల్లా తల్లాడ మండలం నరసింహారావు పేట గ్రామ సమీపంలోని ఎమ్మెస్సార్ స్టోన్ క్రషర్ మిల్లు వద్ద కొనోకార్పస్ మొక్కల పెంపకంపై రైతులు ఆందోళన చేపట్టారు. క్రషర్ మిల్లు చుట్టుపక్కల పెంచిన కొనోకార్పస్ మొక్కల వల్ల పొలాల్లో పనిచేసేందుకు కూలీలు రావడంలేదని, ఈ మొక్కల ద్వారా వచ్చే దుర్వాసన వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు తమ ఆరోగ్యంపై పెరుగుతున్న ముప్పును స్పష్టం చేస్తూ, ఈ మొక్కల వల్ల తమకు శ్వాసకోశ సంబంధిత వ్యాధులు కలుగుతున్నాయని తెలిపారు. "మాకు కూలీలు దొరకడం లేదు. పంట పొలాలకు దగ్గర్లో ఉండడం వల్ల పంటలపై కూడా ప్రభావం పడుతోంది" అని ఒక రైతు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఆరోగ్య సమస్యలు, జీవనోపాధిపై ఆవిర్భవిస్తున్న ముప్పును అరికట్టేందుకు కొనోకార్పస్ మొక్కలను వెంటనే తొలగించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సమస్యను సంబంధిత అధికారులు నిశితంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని, తమ జీవనోపాధిని కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యపై గ్రామస్థులు, రైతుల సమీక్ష నిర్వహించగా, స్థానిక అధికారులు దీనిపై స్పందించి, సమస్యను పరిష్కరించే చర్యలు తీసుకుంటామన్న హామీ ఇచ్చారు.



# పందెం కోళ్లను కబళిస్తున్న ఆర్డీ వైరస్

## సంక్రాంతి కోళ్ల పందాల పై ప్రభావం

## కోళ్ల పెంపకందారుల ఆందోళన

**అశ్వారావుపేట, జనవరి 5, మహా:** సంక్రాంతి పండుగ ఆసన్నమవుతున్న తరుణంలో తెలంగాణ–ఆంధ్ర సరిహద్దు ప్రాంతాల్లో కోడి పందాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. అయితే, ఈ సంవత్సరం పందెం రాయుళ్ల గుండెల్లో గుబులు పుట్టిస్తున్న అంశం ఆర్డీ (రానికేటీల్ డిసీజ్) వైరస్. ఈ మహమ్మారి ప్రభావం వల్ల ఖరీదైన పందెం పుంజులు, నాటు కోళ్లు విపరీతంగా మృత్యువాత పడుతుండటంతో యజమానులు, వ్యాపారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### వైరస్ ప్రభావం.. ఆందోళనలో పందెం రాయుళ్లు

ఆర్డీ వైరస్ తీవ్రత ఇటీవల ఎక్కువగా ఆంధ్రప్రదేశ్‌లో కనిపించగా, ఇప్పుడు తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లోనూ విజృంభిస్తోంది. ఖరీదైన పందెం కోళ్లు ఒక్కసారిగా నీరసించి, గిలగిలా కొట్టుకుంటూ, కిందపడటంతో యజమానులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. విలువైన పందెం పుంజులు కళ్ళముందే గిలగిలా కొట్టుకుంటూ మృత్యువాత పడటం పందెం రాయుళ్ల ఉత్సాహానికి గండి కొడుతోంది.

### సంక్రాంతి కోడి పందాలపై ప్రభావం

ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి. కానీ, వైరస్ విజృంభణ కారణంగా పందెం కోళ్ల కొరత ఏర్పడుతుందని అంచనా. సాధారణంగా రూ.10 వేల నుంచి లక్షల్లో పలికే పందెం పుంజులు ఇలా మృతి చెందడం పందెం రాయుళ్లను తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్నాయి.

### కోళ్ల రక్షణకు పశుసంవర్ధక శాఖ సూచనలు

**పశుసంవర్ధక శాఖ అధికారి కె ప్రదీప్ కుమార్ కోళ్ల యజమానులకు కొన్ని ముఖ్య సూచనలు చేసారు. కోళ్ల షెడ్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, ప్రతిరోజు పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం ద్వారా పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అలాగే అనారోగ్యానికి గురైన కోళ్లను ఇతర కోళ్ల నుంచి వేరుగా ఉంచి, వైరస్ వ్యాప్తిని నివారించాల్సిందిగా కోరారు. చనిపోయిన కోళ్లను సురక్షితంగా పాతిపెట్టడం ద్వారా తదుపరి ప్రమాదాలను నివారించవనని తెలిపారు. పశుసంవర్ధక శాఖ వైద్యుల సలహాలు పాటిస్తూ, సమయానికి వ్యాధినిరోధక మందులు ఇవ్వడం ద్వారా వైరస్ ప్రభావాన్ని తగ్గించవచ్చని అన్నారు.**

# టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంగళరావు




**నేలకొండపల్లి, జనవరి 5 మహా:** టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గా నేలకొండపల్లి మండలం లోని అమ్మగూడెం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి. వెంగళరావు ఎన్నికయ్యారు. వెంగళరావు గతంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి గా, జిల్లా కార్యదర్శి గా పని చేశారు. ఆదివారం జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...ఉపాధ్యాయ సమస్యల పై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరారు. తన పై సంఘం నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందున్న సమర్ధవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. సంఘం బలోపేతం కోసం శక్తి వంచన తేకుండా కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆయన ను పలువురు ఉపాధ్యాయలు అభినందించి ఘనంగా సన్మానించారు.

# మంత్రి చోరవతో గ్రామాభివృద్ధికి ప్రణాళికలు



**నేలకొండపల్లి, జనవరి 5 మహా:** రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చోరతో గ్రామాన్ని అన్ని విధాలు గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించనున్నట్లు రాజేశ్వరపురం మాజీ సర్పంచ్ దండా పుల్లయ్య పేర్కోన్నారు. మండలం లోని రాజేశ్వరపురం పంచాయతీలో మంజూరైన సీసీ రహదారుల ఏర్పాటు పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...గ్రామాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు మంత్రి గ్రామం పై ప్రత్యేక దృష్టి సారించారని పేర్కోన్నారు. రాజకీయాలకు అతీతంగా పంచాయతీ అభివృద్ధి కి సహాకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు దండా సతీష్, పగిళ్ల పృధ్వీ, రవి, బీసు వీరయ్య, దండా నరసింహారావు, సొందు, వీరయ్య. వీరబాబు, కనకయ్య, దండా నవీన్, దండా జనార్ధన్, యడవల్లి హనుమంతు, గడ్డమీది వెంకన్న, పిచ్చయ్య పాల్గొన్నారు.

# గౌడ్‌ల సంక్షేమానికి కృషి



**ఖమ్మం సిటి, జనవరి 05, మహా:** గౌడ్‌ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ గౌడ్తెలిపారు. గౌడ్‌ల సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఆదివారం నాడు ఖమ్మంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గౌడ్‌ల ఐక్యత, సంఘటనం అవసరమని, బీసీ గణన పూర్తయ్యాక మెజారిటీ స్థానాలు బీసీలకు కేటాయించే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు.మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ గౌడ్ గౌడ్ సంఘాలను ఐక్యంగా కొనసాగించాలని, గౌడ్ హాస్టల్ శంకుస్థాపన కోసం ప్రయత్నాలు చేస్తామని తెలిపారు. గౌడ్ సంఘం రాష్ట్ర నాయకుడు అమరగాని వెంకన్న గౌడ్, కత్తి నెహ్రూ గౌడ్ ఇతరులు గౌడ్‌ల అభివృద్ధి కోసం ఒకే వేదికపై పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గౌడ్ సంఘం నాయకులు, విద్యా సంస్థల అధినేతలు, ప్రముఖులు పాల్గొన్నారు.

## దాతల సహాయం మరువలేనిది

### వనవాసీ విద్యార్థులకు సైకిల్స్ వితరణ



**చర్ల,మహా:** దాతల సహకారాన్ని సద్వినియోగపరుచుకొని ఉన్నత స్దితికి చేరుకోవాలని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్ది నిలయ గౌరవ సలహాదారు, విశ్రాంత ప్రదానోపాద్యాయులు బివిఎస్ఎల్ నరసింహారావు అన్నారు. చర్ల గ్రామ నివాసి ప్రస్తుతం హైదరాబాదులో స్దిరపడిన చిప్పా శ్రీనివాస్ , సత్యవాణి దంపతుల కుమారులు మణిదీప్, తేజ్ దీప్ ల జన్మదినం సందర్భంగా ఆదివారం వనవాసీ విద్యార్దుల సౌకర్యం రూ,13 వేల విలువచేసే రెండు హెూరో సైకిల్లను అందచేసారు. వనవాసీ నిలయంలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్ సోదరుడు చిప్పా నరసింహమూర్తి వనవాసీ ప్రచండ ప్రముఖ్ గొంది శోభన్‌బాబుకు సైకిళ్లను అందచేసారు. విద్యార్దులు దాతలు అందచేస్తున్న అవకాశాలను సద్వినియోగపరుచుకోవాలన్నారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత స్దితికి చేరుకోవాలని వక్తలు స్పష్టం చేశారు. విద్యార్దులు పడుతున్న అవస్దలను చూసి సైకిల్లను అందచేసిన శ్రీనివాస్ – సత్యవాణి దంపతులను అబినందించారు. గతంలో కూడా విద్యార్దులకు పరుపులను అందచేసారని గుర్తుచేసారు. సేవా భావంతో పేద గిరిజన విద్యార్దులకు ఇటువంటి వితరణలను అందచేస్తూ దాతలు మానవత్వం చాటుకోవడ%శీ% అబినందనీయమన్నారు. కార్యక్రమంలో వనవాసీ నిలయ కమిటీ ఉపాధ్యక్షులు జవ్వాది మురళీకృష్ణ, కోశాదికారి వేములపల్లి ప్రవీణ్, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి మరియు విద్యార్దులు పాల్గొన్నారు.

## మిత్రుల అపూర్వ కలయిక



**సత్తుపల్లి, జనవరి 5, మహా:** సంతృప్తికరమైన మానవ సంబంధాలు, వ్యక్తిగత అనుబంధాలు, సహాయ సూత్రాలు – ఇవన్నీ మనం ఎప్పటికప్పుడు అనుభవించే అంశాలు. మూడున్నర దశాబ్దాల క్రితం ఒకచోట కలసి చదువుకున్న మిత్రుల ఆనందకరమైన కలయిక ఆదివారం సత్తుపల్లిలోని శ్రీబండి శోభనాచలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిపిన కార్యక్రమంలో మరింత పటవంతమైన స్థాయికి చేరుకున్నాయి. ఈ సమ్మేళన కార్యక్రమం ఒక స్నేహబంధం యొక్క ఉజ్వలమైన ఉదాహరణగా నిలిచింది. మూడున్నర దశాబ్దాల క్రితం, 1989–90 సంవత్సరాలలో, ఎస్బీఎస్ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఈ రోజు సత్తుపల్లి పాఠశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా, పాఠశాల కాలం నుండి హరివిల్లు చేసిన గడపలను జ్ఞాపకం చేసుకోవడమే కాకుండా, తమ జీవితాలను కూడా పునఃసమీక్షించారు. ఈ సమావేశంలో మొత్తం 100 మంది మిత్రులు వివిధ ప్రాంతాల నుండి సత్తుపల్లిలో చేరి ఒకచోట కలుసుకున్నారు. ఈ కలయిక కోసం పాఠశాల సమాజంలో జరిగిన మార్పులను, వ్యక్తిగత విజయాలను చర్చించడం, పాఠశాల జీవితం పై మధురమైన జ్ఞాపకాలను పంచుకోవడం, ఇలా అన్నింటినీ సమర్పణగా తీసుకోవడం జరిగింది. ఈ సమ్మేళనం కేవలం మధుర జ్ఞాపకాలు పంచుకోవడమే కాకుండా, ఒక గొప్ప సామాజిక కార్యక్రమానికి కూడా దారితీసింది. “ఆపదలో ఉన్న మిత్రుల సహాయార్థం ఫౌండేషన్” ను ఏర్పాటు చేయడం ఈ సమ్మేళనాన్ని మరింత విశిష్టమైనదిగా మార్చింది. ఈ ఫౌండేషన్ సహాయ ప్రదర్శనలో పాఠశాల విద్యార్థుల సమాజంలోని బాధితులను ఆదుకోవడానికి కొత్త మార్గాలు తెరుచుకుంది. ఈ సంస్థ ద్వారా ఆపదలో ఉన్న మిత్రుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడానికి ప్లాన్ చేయబడింది. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఏర్పాటు చేసే అంశానికి పూర్వ విద్యార్థులు ప్రత్యేక ఆమోదాన్ని తెలిపారు. ఈ ఫౌండేషన్ సాహాయం కోసం మొదటగా వీరపనేని అప్పారావు (బాబీ) రూ. లక్ష విరాళంగా ప్రకటించారు. మిగతా స్నేహితుల నుంచి కూడా ప్రతినెలా రూ. 10,000 చొప్పున సహాయం అందించేందుకు నిర్ణయించారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల వేడి




**ఖమ్మం, జనవరి 05, మహా:** ఖమ్మం – వరంగల్ – నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు పూర్తి స్థాయిలో సిద్ధమవుతున్నారు. నర్సిరెడ్డి పదవీకాలం ముగియనుండటంతో ఏప్రిల్‌లో కొత్త ఎమ్మెల్సీ ఎన్నిక ప్రక్రియ చేపట్టనున్నారు. ఉపాధ్యాయ వర్గాల ఆకాంక్షలు, అభ్యర్థుల ప్రచార వేడి, ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై ఉపాధ్యాయ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

### ఎన్నికల వేడి ప్రారంభం...

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రాముఖ్యంగా మారాయి. 2019 ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో 20,500 ఓటర్లతో సాగిన ప్రక్రియ, ఈ ఏడాది 25,000కు పైగా ఓటర్లను కలిగి మరింత ఉత్కంఠను కలిగిస్తోంది. ఈ మార్పు ఉపాధ్యాయ వర్గాల్లో మద్దతు కసరత్తుకు ప్రాధాన్యం పెంచింది.

### ప్రాథమిక ఏర్పాట్లలో అధికారులు

పోలింగ్ కేంద్రాలు, వసతుల మెరుగుదల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రాథమిక ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాలను సౌకర్యవంతంగా ఏర్పాటు చేశారు. తాగునీరు, విద్యుత్తు, ప్రహరీలు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. ప్రతి కేంద్రంలో గరిష్ఠంగా వెయ్యి మంది ఓటర్లను అనుమతించేందుకు ప్రణాళిక రూపొందించారు.

### ఓటర్ల జాబితా సిద్ధం...

పెరిగిన సంఖ్య, అధిక అంచనాలు
తుది ఓటర్ల జాబితా విడుదల కావడంతో ఉపాధ్యాయుల నుంచి ఎన్నికలపై ఆసక్తి మరింత పెరిగింది. అర్హులైన ఓటర్లకు ఓటు నమోదు దరఖాస్తు అవకాశాలు కొనసాగుతుండటంతో, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంచనాలు పెరుగుతున్నాయి. గతంతో పోలిస్తే ఈసారి నూతన ఓటర్లు అధికమవడంతో ఓటు ప్రాధాన్యత మరింత విస్తరించనుంది.

### ఉపాధ్యాయ సమస్యల హామీలు

ఎమ్మెల్సీ ఎన్నికల తేదీ సమీపిస్తున్న వేళ అభ్యర్థులు తమ ప్రచార వ్యూహాలను గట్టిగా అమలు చేస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తూ, తమకు అనుకూలంగా మద్దతు సంపాదించేందుకు ప్రయత్నిస్తున్నారు. పట్టణాలు, మండల కేంద్రాల్లో ప్రచారం మరింత ఉత్సాహంగా సాగుతోంది. మెరుగైన వేతనాలు, పదోన్నతులు, ఉపాధ్యాయ సంక్షేమంపై హామీలు ఇస్తూ ఉపాధ్యాయుల ఆకర్షణ పొందుతున్నారు.

### అనుకూల అభ్యర్థుల ఎంపికపై దృష్టి

ఉపాధ్యాయ సంఘాలు తమ సభ్యుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, అనుకూల అభ్యర్థులను ఎంపిక చేసేందుకు సమాలోచనలు జరుపుతున్నాయి. ఈ ఎన్నికల్లో సంఘాల మద్దతు అత్యంత కీలకంగా మారనుంది. అభ్యర్థుల హామీలను విశ్లేషించి, వారి గత రికార్డులను పరిశీలించి సంఘాలు నిర్ణయాలు తీసుకుంటున్నాయి.

### చరిత్రలో ఎన్నికల ప్రాధాన్యం

గత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కీలకంగా నిలిచాయి. నర్సిరెడ్డి గత పదవీకాలంలో ఉపాధ్యాయ సమస్యలపై పనిచేసి విశేష గుర్తింపు పొందారు. 2019లో ఇచ్చిన హామీల అమలు స్థాయి, 2024లో పోటీ చేస్తున్న అభ్యర్థుల హామీలతో పోల్చుకుంటూ ఉపాధ్యాయ వర్గాలు తమ నిర్ణయాలను రూపొందిస్తున్నాయి.
– పోలింగ్ నిర్వహణ, సాంకేతికతకు ప్రాధాన్యం.
ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగేందుకు సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. ఓటర్ల గుర్తింపు విధానంలో ఆధునిక పద్ధతులను అనుసరిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు ఎదురుకాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. అధిక ఓటర్ల సంఖ్య ఉన్న ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని నియమించి, సజావుగా ఎన్నికలు నిర్వహించే ఏర్పాట్లు పూర్తయ్యాయి.

### ఉపాధ్యాయుల ఆశలు...

**ఈ ఎన్నికల ద్వారా ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం పొందుతా యనే ఆశయంతో ఉపాధ్యాయ వర్గాలు ఎదురు చూస్తున్నాయి. ఎన్నికల ఫలితాలు ఉపాధ్యాయ వేతనాలు, పదోన్నతులు, సదుపాయాల మెరుగుదలపై ప్రభావం చూపుతాయనే నమ్మకంతో ఈ నియోజకవర్గం ఆసక్తికరంగా మారింది.ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఏప్రిల్‌లో జరుగుతాయనే అంచనాలతో రాజకీయాలు వేడెక్కాయి. అభ్యర్థుల ప్రచార వ్యూహాలు, అధికారుల నిర్వహణ పద్ధతులు, ఉపాధ్యాయ సంఘాల స్పందనతో ఎన్నికలు మరింత ఉత్కంఠభరితంగా మారాయి.ఖమ్మం - వరంగల్ -నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలో 14,940 మంది పురుషులు, 9965 మంది మహిళలు కలిపి 24,905 మంది ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గంలో దాదాపు 200 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించారు.**